


EVENING EDITION
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
బుధవారం
25 సెప్టెంబర్ 2024
పేజీలు: 02



## రాష్ట్రంలో 15 లక్షల రేషన్ కార్డుల రద్దు?

రాష్ట్రంలో దాదాపు 15 లక్షల తెల్ల రేషన్ కార్డులు రద్దు కానున్నట్లు తెలుస్తోంది. ఈ-కేవైసీ ప్రక్రియకు హాజరుకాకపోవడంతో వీరందరి కార్డులను ప్రభుత్వం రద్దు చేస్తుందని సమాచారం. ఇకపై రేషన్ కార్డుల జారీలో పకడ్బందీగా వ్యవహరించాలని సర్కార్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి నుంచి సిటిజన్ 360 డేటా సాయంతో అర్హులైన వారికే కార్డులు మంజూరు చేయనుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 89.96 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి.

## హైదరాబాద్-అయోధ్య విమాన సర్వీసులు

శంషాబాద్ నుంచి రాముడి జన్మస్థానమైన అయోధ్యకు ఈ నెల 27 నుంచి ఇండిగో విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి. వారంలో నాలుగు రోజులు ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయి. అలాగే ఈ నెల 28 నుంచి ప్రయాగ్ రాజ్, ఆగ్రాకు కూడా రెండు సర్వీసులను ఇండిగో ప్రారంభించనుంది. వారంలో 3 రోజులు ఈ విమానాలు తిరుగుతాయి. అటు ప్రతి సోమ, మంగళవారాల్లో అగర్తల, జమ్మూలకు విమాన సర్వీసులు ఉంటాయని ఇండిగో ప్రకటించింది.



## హజ్ యాత్ర దరఖాస్తు గడువు పొడిగింపు

హజ్ యాత్రకు దరఖాస్తు గడువును హజ్ కమిటీ ఆఫ్ ఇండియా పొడిగించింది. ఈ నెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి ఎన్ఎమ్‌డీ ఫరూక్ తెలిపారు. ఏపీ నుంచి ఇప్పటి వరకు 1,937 మంది యాత్రకు వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు.




## అమ్మాయితో అసభ్యకరంగా ప్రవర్తించిన ఆర్టీసీ కండక్టర్

సెప్టెంబర్ 23 తేదీ నాడు జడ్చర్ల నుండి హైదరాబాద్‌కు వెళ్తున్న TS07UG6541 ఆర్టీసీ బస్సులో కండక్టర్ ఓ అమ్మాయితో అసభ్యకరంగా ప్రవర్తించాడని.. ఇంత మంది ఉన్న బస్సులోనే ఓ ప్రభుత్వ ఉద్యోగి ఇలా ఓ అమ్మాయిని అనుచితంగా తాకరని చోట తాకడని ఆవేదన వ్యక్తం చేసింది.



## కారుకు గీతలు గీశారని.. 8 మంది చిన్నారులపై కేసు

### అంతా 2 నుంచి 9 ఏళ్లలోపు వారే

రిపేరుకు డబ్బులిస్తామని తల్లిదండ్రులు చెప్పిన వినని కానిస్టేబుల్. హనుమకొండ రాంనగర్‌లోని ఒక అపార్ట్ మెంట్‌లో సీఐడి విభాగంలో పని చేసే కానిస్టేబుల్ నివాసం ఉంటున్నాడు.. అదే అపార్ట్ మెంట్‌లో పార్కింగ్‌లో చిన్నారులు ఆడుకుంటుండగా కానిస్టేబుల్ కారుపై గీతలు పడ్డాయి. దీంతో తన కారుకు గీతలు పెట్టారని ఆ కానిస్టేబుల్.. చిన్నారులపై పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేసి కర్కశంగా ప్రవర్తించాడు. ఇటీవల పిల్లల తల్లిదండ్రులను పోలీసు స్టేషన్‌కు పిలవడంతో.. కేసు నమోదైన విషయం తెలిసింది. చిన్నపిల్లలపై కేసు నమోదు చేయడమేంటని తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేశారు.




## తెలంగాణలో దసరా నాటికి
# క్యాబినెట్ విస్తరణ

రాష్ట్రంలో త్వరలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందని, కొత్తగా ఐదారుగురికి కేబినెట్‌లో చోటు దక్కే అవకాశం ఉందని మంత్రి రాజనర్సింహ పేర్కొన్నారు. సీతక్కకు హోంమంత్రి ఇచ్చే అవకాశం ఉందని తెలిపారు. హైదరాబాద్‌లో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన ఆయన, ఈ మేరకు వ్యాఖ్యానించారు. త్వరలోనే మంత్రివర్గ విస్తరణ చేపట్టే అవకాశం ఉందని మంత్రి దామోదర రాజ నర్సింహ పేర్కొన్నారు. మినిస్టర్స్ క్వార్టర్స్ లోని తన నివాసంలో ఇష్టాగోష్టిగా మాట్లాడిన మంత్రి, ఐదారుగురికి కొత్తగా మంత్రివర్గంలో చోటు దక్కనుందన్నారు. శాఖల మార్పులకు సైతం అవకాశం ఉందన్న ఆయన, కీలకమైన హోం మంత్రి పదవి ప్రస్తుతం మహిళా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న సీతక్కకు ఇచ్చే అవకాశం ఉందన్నారు. మంత్రివర్గంలో కుల సమీకరణాల ఆధారంగా ఓ ముదిరాజ్‌కు, రెడ్డికి సైతం స్థానం ఉంటుందని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రివర్గంలో స్థానం ఉంటుందన్న దామోదర, హైదరాబాద్ నుంచి దానం నాగేందర్‌కు చోటు కల్పించే ఆస్కారం ఉందన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి మరొకరికి చోటు దక్కనున్నట్టు పేర్కొన్నారు. పార్టీలు మారిన వారికి మంత్రివర్గంలో చోటు ఇవ్వొద్దనుకున్నప్పటికీ, రాజకీయ సమీకరణాల నేపథ్యంలో బయట నుంచి వచ్చిన వారికి సైతం మంత్రి వర్గంలో చోటు దక్కనుందని స్పష్టం చేశారు. ఇటీవల 5 రోజుల పాటు ఢిల్లీలో మకాం వేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు, కాంగ్రెస్ పెద్దలతో వరుస భేటీలు జరిపారు. నూతన పీసీసీ అధ్యక్షుడి ఎంపిక, మంత్రి మండలి విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ తదితర అంశాలపై చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈరోజు మధ్యాహ్నం గవర్నర్‌తో సీఎం భేటీలోనూ కేబినెట్ విస్తరణపైనే చర్చించినట్లు పార్టీ వర్గాల విశ్వసనీయ సమాచారం. ఈ నెల 7 తర్వాత ఆషాఢ మాసం వస్తుండటంతో అంతకు ముందే ప్రమాణ స్వీకారం చేయాలన్న భావనతో పార్టీ వర్గాలు ఉన్నాయి. రేవంత్ ఢిల్లీ పర్యటనలో ఏఐసీసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, మంత్రివర్గ విస్తరణకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించి ఉంటే గవర్నర్ వద్ద సీఎం ఇదే అంశం చర్చించి ఉండొచ్చని తెలుస్తోంది.

## "దేవర" బుకింగ్స్ కి సెన్సేషనల్ రెస్పాన్స్

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా దర్శకుడు కొరటాల శివ తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం "దేవర" కోసం అందరికీ తెలిసిందే. అయితే తారక్ నుంచి ఎన్నో ఏళ్ళ తర్వాత సోలోగా వస్తున్న సినిమా ఇది కావడంతో అంచనాలు పీక్స్ లో ఉన్నాయి. ఇలా భారీ ధరలు అదనపు హైక్ గా ఇచ్చినప్పటికీ దేవర సత్తా చూపిస్తున్నాడు. రెండు తెలుగు రాష్ట్రాల్లో అయితే డే 1 కి సెన్సేషనల్ బుకింగ్స్ దేవర కి నమోదు అవుతున్నాయి. ఇలా లేటెస్ట్ ట్రెండ్ ఒక్క హైదరాబాద్ సిటీ నుంచే అడ్వాన్స్ బుకింగ్స్ లో 10 కోట్లకి పైగా గ్రాస్ ని అందుకున్నట్టు తెలుస్తోంది. దీనితో టోటల్ రిపోర్టింగ్ గ్రాస్ గా అయితే దేవర నైజాం మార్కెట్ లో భారీ నంబర్స్ ని సెట్ చెయ్యడం ఖాయం అని చెప్పొచ్చు. మరి చూడాలి దేవర డే 1 వసూళ్లు ఏ లెవెల్లో ఉంటాయి అనేది.




## ఐఫోన్ కొని పార్టీ ఇవ్వలేదని బాలుడిని హత్య చేసిన స్నేహితులు



ఢిల్లీలోని షకర్‌పూర్‌కు చెందిన సచిన్ అనే 16 యేళ్ల యువకుడు కొత్త ఫోన్ కొనుగోలు చేయడానికి షాపుకు వెళ్లాడు. సెప్టెంబర్ 23 సాయంత్రం 7 గంటల సమయంలో సచిన్ కొత్త మొబైల్ ఫోన్ కొని ఇంటికి తిరిగి వస్తుండగా ఓ చిరుతిండి దుకాణం దగ్గర సచిన్ స్నేహితులు ఎదురయ్యారు. సచిన్ వద్ద కొత్త ఫోన్ చూసిన వారంతా తమకు పార్టీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే తన వద్ద డబ్బు లేదనీ.. పార్టీ ఇవ్వలేనని చెప్పాడు. సచిన్ పార్టీ ఇచ్చేందుకు నిరాకరించడంతో వారిమధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అది కాస్త తీవ్రమవ్వడంతో ఘర్షణకు దారితీసింది. ఈ పెనుగులాటలో ఓ యువకుడు సచిన్‌ను వెనుక నుంచి కత్తితో రెండు సార్లు పొడిచాడు. సచిన్ ఘటనా స్థలంలోనే కుప్పకూలిపోవడంతో వారంతా పారిపోయారు. వెంటనే స్థానికులు బాధితుడిని ఆసుపత్రికి తరలించి, చుట్టుపక్కలవారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అయితే సచిన్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ మృతి

మాగుంట కుటుంబంలో విషాదం నెలకొంది. మాజీ ఎంపీ, ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ(77) అనారోగ్యంతో చెన్నై అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. దివంగత ఎంపీ సుబ్బరామిరెడ్డికి సతీమణి అయిన ఆమె.. 1996లో INC తరఫున ఒంగోలు ఎంపీ, 2004లో కావలి ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రస్తుత ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డికి పార్వతమ్మ వదిన. ఆమె మృతి తమ కుటుంబంలో విషాదం నింపిందని, రేపు నెల్లూరులో అంత్యక్రియలు నిర్వహిస్తామని ఎంపీ వెల్లడించారు.

## జలదిగ్భందంలో ఏడుపాయల ఆలయం.. గర్భగుడిలోకి చేరిన వరద నీరు



మెదక్ జిల్లా ఏడుపాయలలో ఉన్న వన దుర్గామాత ఆలయం రెండో రోజూ జలదిగ్భందంలో చిక్కుకుపోయింది. సింగూరు ప్రాజెక్టు నుంచి నీరు వదలడంతో గర్భ గుడిలోకి వరద చేరింది. ఆలయం ఎదుట మంజీరా ప్రవాహం ఉధృతంగా కొనసాగుతోంది. రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు కొనసాగుతున్నాయి. ఈ నెలలో కురిసిన భారీ వర్షాలతో 12 రోజుల పాటు ఏడుపాయల ఆలయం మూతపడింది.మరో వైపు సింగూరు ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో ఒక గేటును ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సింగూరు ప్రాజెక్టు విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 10,431 క్యూసెక్కులు, ఔట్ ఫ్లో 11,461 క్యూసెక్కులుగా ఉంది. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 29.91 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 29.76 టీఎంసీలుగా ఉంది.

## గుజరాత్‌లో ఘోర ప్రమాదం.. ఏడుగురు మృతి



గుజరాత్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సబర్‌కాంతా జిల్లాలోని హిమ్మత్ నగర్ వద్ద కారు – లారీ ఢీకొన్నాయి. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఏడుగురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రులకు తరలించారు. మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రమాదానికి అతి వేగమే కారణమని పోలీసులు నిర్ధారించారు. కారు పూర్తిగా ధ్వంసమైంది. కారు శ్యామలజీ నుంచి అహ్మదాబాద్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుల నివాసాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

## కక్ష్యలోకి 5 శాటిలైట్లను పంపిన చైనా రాకెట్



కమర్షియల్ రాకెట్ లిజియన్-1ను ఇవాళ చైనా ప్రయోగించింది. ఆ రాకెట్ ద్వారా అయిదు ఉపగ్రహాలను తీసుకెళ్లారు. నిర్దేశిత కక్ష్యలో ఆ శాటిలైట్లను రిలీజ్ చేసినట్లు తెలుస్తోంది. లిజియన్-1 రాకెట్‌ను సీఏఎస్ స్పేస్ అభివృద్ధి చేసింది. ఇవాళ ఉదయం 7.33 నిమిషాలకు ఈ పరీక్ష జరిగింది. జిక్వాన్ శాటిలైట్ లాంచ్ సెంటర్ నుంచి ప్రయోగం సాగింది. అయిదు ఉపగ్రహాల్లో.. రెండు ఎయిర్‌శాట్ కంపెనీ ఉపగ్రహాలు ఉన్నాయి. జిలిన్-1 ఎస్ఏఆర్01ఏ, యున్యావో-1 శాలిలైట్లను ల్యాండ్ సర్వే, వాతావరణ స్టడీ కోసం వాడనున్నారు. లిజియాన్1 తరహా రాకెట్లను చైనా ప్రయోగించడం ఇది నాలుగవ సారి. 2022 జూలైలో తొలిసారి జలిజియన్ రాకెట్‌ను ప్రయోగించారు. ఇప్పటి వరకు ఆ రాకెట్ల ద్వారా 42 శాలిటైల్లను పంపారు. వాటి ద్వారా 4 టన్నుల బరువైన పేలోడ్స్ కూడా మోసుకెళ్లారు.

## సీఎం రేవంత్ విధ్వంసక పరిపాలనకు ధన్యవాదాలు



రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహా నగరంలో ఇండ్ల అమ్మకాలు పడిపోయాయి. ప్రస్తుతం జులై – సెప్టెంబర్ త్రైమాసికం ఇండ్ల అమ్మకాలు 42 శాతం పడిపోయినట్లు ప్రాప్ ఈక్విటీ అనే సంస్థ నివేదికను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ నివేదికపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు.అభివృద్ధి చెందుతున్న మహానగరం సంక్షోభంలోకి వెళ్తుందనడానికి ఈ నివేదికనే నిదర్శనం అని కేటీఆర్ పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విధ్వంసక పరిపాలనకు ధన్యవాదాలు అంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఆర్ఆర్ ట్యాక్స్, పిచ్చి కూల్చివేతల కారణంగా రియల్ ఎస్టేట్ రంగం సంక్షోభంలోకి కూరుకుపోయిందన్నారు. రాజధానిలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపకపోవడంతో.. హైదరాబాద్ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని కేటీఆర్ తెలిపారు. దేశానికే ఆదర్శంగా నిలిచిన హైదరాబాద్ ఇవాళ గందరగోళ పరిస్థితుల్లో కూరుకుపోయిందన్నారు. రేవంత్ రెడ్డి తీరును ఈ దేశం గమనిస్తుందన్నారు.

నేటి దినపత్రిక సూర్య EVENING EDITION 4PM
www.suryaa.com





## నా కల నెరవేరింది

'యానిమల్' సినిమాతో ఒక్కసారిగా యువతలో క్రేజ్ సంపాదించుకుంది బాలీవుడ్ భామ త్రిప్తి డిమ్రీ. ప్రస్తుతం ఈ అమ్మడికి వరుసగా భారీ ఆఫర్లొస్తున్నాయి. ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చిన 'బ్యాడ్ న్యూజ్' చిత్రం కూడా ఈ భామకు మంచి గుర్తింపు తీసుకొచ్చింది. త్రిప్తి డిమ్రీ కథానాయికగా నటించిన తాజా చిత్రం 'విక్కీ విద్యా కా వో వాలా వీడియో' చిత్రం అక్టోబర్ 11న విడుదలకానుంది.ఈ నేపథ్యంలో ప్రమోషనల్ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమె ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. ఇప్పటివరకు తనకు సినిమాల్లో డ్యాన్స్ చేసే అవకాశం రాలేదని, ఈ సినిమాలో 'మేరే మెహబూబ్' అనే పాట ఆ లోటును తీర్చిందని ఆనందం వ్యక్తం చేసింది. 'నాకు డ్యాన్స్ అంటే చాలా ఇష్టం. అయితే ఇప్పటివరకు ఒక్క సినిమాలో కూడా డ్యాన్స్ చేసే అవకాశం దక్కలేదు.ఈ విషయం చాలా బాధపెట్టేది. 'విక్కీ విద్యా కా వో వాలా వీడియో' చిత్రంలో నాపై పాట ఉందని తెలియగానే పట్టరాని సంతోషమేసింది. కొరియోగ్రాఫర్ గణేష్ ఆచార్య ప్రోత్సాహంతో చాలా సులభంగా డ్యాన్స్ చేయగలిగాను. నేను తొలిసారి డ్యాన్స్ చేసిన ఈ పాట ఎప్పటికీ గుర్తుండిపోతుంది' అని త్రిప్తి డిమ్రీ ఆనందం వ్యక్తం చేసింది.



# రూ.400 కోట్ల విరాళాలు వచ్చాయి

## ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం విజయవాడ కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకున్నారు. వరద బాధితులకు నష్టపరిహారం పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సీఎం తన చేతుల మీదగా పలువురికి నష్టపరిహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు కూడా పాల్గొన్నారు. సహాయక కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను సీఎం చంద్రబాబు అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ అధికారుల సమీక్ష సమావేశల్లో కంటే వరద సహాయక కార్యక్రమాలలోనే ఎక్కువ సమయం వెచ్చించానని.. 400 వందల కోట్ల రూపాయలు సీఎం సహాయ నిధికి వచ్చాయని.. వరద సహాయ కార్యక్రమంలో అధికారులు మంత్రులు ఒక స్పిరిట్‌తో పనిచేశారని, ఇంత పెద్ద ప్రకృతి విపత్తులో తనతో పాటు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది 10 -11 రోజుల పాటు నిర్విరామంగా పని చేశారని చంద్రబాబు నాయుడు కొనియాడారు. వరద నీటిలో ఉన్న బాధితులకు అన్ని రకాలుగా సాయం అందించే ప్రయత్నం చేశామన్నారు. ఇంత పెద్ద విపత్తులో చిన్న చిన్న ఇబ్బందులు కూడా ఉంటాయని, ఆఖరు బాధితుడికి కూడా సాయం అందలన్నదే తమ లక్ష్యమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ నుంచి నేరుగా నష్టపరిహారం సొమ్మును ముఖ్యమంత్రి చంద్రబాబు బాధితుల ఖాతాల్లో జమచేశారు. ఎన్యూమరేషన్ పూర్తి కావడంతో అర్హులైన బాధితులందరికీ వారి ఖాతాల్లో పరిహారం డబ్బులు జమ కానున్నాయి. వరదలతో నష్టపోయిన వాహనాలకు బీమా చెల్లింపులు కూడా ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాగా విజయవాడలోని 179 సచివాలయాల పరిధిలోని ప్రజలకు ప్రభుత్వం సాయం అందిస్తుంది. వరదల్లో గ్రౌండ్ ఫ్లోర్ మునిగినవారికి రూ. 25వేలు, మొదటి.. ఆపై అంతస్తుల్లో ఉండేవారికి రూ. 10 వేలు, దుకాణాలు ధ్వంసమైనవారికి రూ. 25 వేలు, హెక్టారు పంటకు రూ. 25వేలు చొప్పున పరిహారం అందిస్తారు. అర్హులైన బాధితులందరికీ డబ్బులు జమచేయనున్నారు. భారీ వర్షాలతో ఏపీ వ్యాప్తంగా 16 జిల్లాల్లో ఆస్తులు, పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. బుడమేరు వరదలకు విజయవాడలో పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 4 లక్షల మందికి ప్రభుత్వం ఆర్థిక ప్యాకేజీ ఇవ్వనుంది. ఒక్క విజయవాడ పరిధిలోనే ముంపు బారిన పడిన బాధితులు సుమారు లక్షన్నర మంది ఉన్నారు. బాధితులకు ఆర్థిక సాయం కింద సుమారు రూ. 600 కోట్లను ప్రభుత్వం పంపిణీ చేయనుంది. ఇళ్లు, దుకాణాలు, తోపుడు బళ్లు, వ్యాపారాలు, చిన్న తరహా పరిశ్రమలు, వాహనాలు, పంటలు, పశువులకు ఆర్థిక సాయం అందించనుంది. ఎన్యూనరేషన్‌లో మిస్సయినవారికి నిబంధనల ప్రకారం ఆర్థిక ప్యాకేజీ కూడా అందజేయనున్నారు. మొత్తానికి వరదల్లో తీవ్రంగా నష్టోయిన అందరికి బుధవారం నుంచి ప్రభుత్వ సాయం అందుతుందది.

## అత్యాచారం కేసుపై స్పందించిన యూట్యూబర్ హర్షసాయి



ప్రముఖ తెలుగు యూట్యూబర్ హర్షసాయిపై అత్యాచారం కేసు నమోదైన విషయం తెలిసిందే. తనను పెళ్లి చేసుకుంటానని, శారీరకంగా వాడుకొని మోసం చేశాడని ఓ యువతి మంగళవారం హైదరాబాద్ నార్సింగి పోలీసులను ఆశ్రయించింది. పేదలకు సేవ చేస్తున్నానంటూ యూట్యూబ్‌లో రీల్స్ చేస్తున్న హర్ష సాయి అనేక అరాచకాలకు పాల్పడ్డాడని ఆ యువతి ఫిర్యాదులో పేర్కొంది. అంతేగాకుండా తనను ప్రేమతో మోసం చేసి పెళ్లి చేసుకుంటానంటూ నమ్మించి పలుమార్లు శారీరకంగా వాడుకుని, ఇప్పు డు తెలియదన్నట్టుగా వ్యవహరిస్తున్నాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పెళ్లి చేసుకునేందుకంటూ తన నుంచి రూ.2 కోట్ల నగదు తీసుకున్నాడని, ఇందుకు ఆయన తండ్రి రాధాకృష్ణ కూడా కారణమని పేర్కొన్నది. అయితే దీనిపై కేసు నమోదు చేసిన నార్సింగి పోలీసులు విచారణ చేపట్టి తదుపరి వివరాలు తెలుపుతామని చెప్పారు.ఇదిలావుంటే తాజాగా ఈ ఘటనపై యూట్యూబర్ హర్షసాయి సోషల్ మీడియా వేదికగా స్పందించాడు. నాపై వస్తున్న ఆరోపణలన్నీ అబద్ధం. డబ్బుల కోసమే ఇలాంటి తప్పడు ఆరోపణలు చేస్తున్నారు. నా గురించి మీ అందరికి తెలుసు. త్వరలోనే నిజానిజాలు బయటకొస్తాయి. ఈ వివాదంపై విజయవాడకు చెందిన మా లాయర్ తానికొండ చిరంజీవి త్వరలో మీ ముందుకు వస్తారు అంటూ రాసుకొచ్చాడు.



## జెత్వానీ కేసు.. విశాల్ గున్నీకి ఊరట

నటి కాదంబరీ జెత్వానీ కేసులో ఐపీఎస్ విశాల్ గున్నీకి హైకోర్టులో ఊరట లభించింది. అక్టోబర్ 1 వరకు ఆయనపై చర్యలు తీసుకోవద్దని పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది. ఆరోజుకు విచారణను వాయిదా వేసింది. కాగా దర్యాప్తు పేరుతో తనను వేధించినట్లు జెత్వానీ గున్నీతో పాటు మరో ఇద్దరు పోలీస్ ఉన్నతాధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా టాటాపై ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.



## 48 గంటల్లో తెలంగాణలో భారీ వర్షాలు

గత నాలుగైదు రోజుల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వానలు దంచికొడుతున్న సంగతి తెలిసిందే. మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా రాబోయే 48 గంటల్లో రాజధాని హైదరాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ – మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలో రాబోయే 48 గంటల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉందని, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు.

## జమ్ముకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల రెండో విడత పోలింగ్‌లో ఓటేసిన 102 సంవత్సరాల వృద్ధుడు




జమ్ముకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల రెండో విడత పోలింగ్ జోరుగా సాగుతోంది. ఓటర్లు పోలింగ్ కేంద్రాల దగ్గర పెద్ద ఎత్తున బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఉదయం ఏడు గంటలకు మొదలైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగనుంది. ఓటు వేసేందుకు యువత, వృద్ధులు భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటున్నారు. దాంతో ఏ పోలింగ్ కేంద్రంలో చూసినా చేంతాడంత క్యూలు దర్శనమిస్తున్నాయి. రియాసిలోని ఓ పోలింగ్ కేంద్రంలో 102 ఏళ్ల వృద్ధుడు హాజీ కరీమ్ దిన్ భట్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటేసిన అనంతరం పోలింగ్ కేంద్రం ఆవరణలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే అభివృద్ధి పనులు బాగా జరుగుతాయని అన్నారు. పిల్లలకు మంచి విద్య లభిస్తుందని చెప్పారు. వ్యాపారాలు మెరుగుపడుతాయన్నారు. కాగా జమ్ముకశ్మీర్‌లోని మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 18న తొలి విడత పోలింగ్ పూర్తయ్యింది. తొలి విడతలో 24 స్థానాలకు పోలింగ్ జరిగింది. ఇవాళ రెండో విడత పోలింగ్ జరుగుతోంది. రెండో విడతలో 26 స్థానాలకు నిర్వహిస్తున్నారు. ఇక మిగిలిన 40 స్థానాలకు అక్టోబర్ 1న మూడో విడత పోలింగ్ జరగనుంది. అక్టోబర్ 8న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడిస్తారు.

## స్త్రీ-3 కోసం ఎదురుచూస్తున్నా..

"స్త్రీ-2' నా కెరీర్‌కి ఊహించని వరం. ఈ స్థాయి విజయాన్ని నేనెన్నడూ ఊహించలేదు. ఖాన్ సినిమాలకు వచ్చే కలెక్షన్లు కథానాయిక నేపథ్య చిత్రానికి రావడం నిజంగా ఆశ్చర్యం. ప్రస్తుతానికి దేశంలోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో ఆరోస్థానంలో 'స్త్రీ-2' ఉంది. ఇంకా వసూళ్లు బాగానే ఉన్నాయని, ఈ లెక్కలు కూడా మారే ఛాన్సుందని చెబుతున్నారు.' అంటూ ఆనందం వెలిబుచ్చింది శ్రద్ధా కపూర్. ఆమె ప్రధాన పాత్రలో రూపొందిన చిత్రం "స్త్రీ -2'. 2018లో వచ్చిన హిట్ సినిమా 'స్త్రీ' చిత్రానికి ఇది సీక్వెల్. ఆగస్ట్ 15న విడుదలైన ఈ సినిమా 39రోజుల్లో 604కోట్ల షేర్, 713కోట్ల గ్రాస్ కలెక్షన్లు సాధించింది. తాజా ఇంటర్వ్యూలో ఈ విజయం గురించి శ్రద్ధా ఆసక్తికరంగా మాట్లాడింది. 'పెద్ద స్టార్లు లేకపోయినా కథను ఆసక్తికరంగా చెబితే జనం ఆదరిస్తారని 'స్త్రీ 2'తో రుజువైంది. ఈ ఫ్రాంచైజీ కొనసాగుతూనే ఉండాలని కోరుకుంటున్నా. 'స్త్రీ 3'కోసం నేనూ ఈగర్లీ ఎదురు చూస్తున్నా.' అని చెప్పుకొచ్చింది శ్రద్ధా.

